క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం సుష్యమి నక్షత్రం షష్ఠి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటల వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసి వేస్తారు.

నటరాజ్‌కు ఘన సన్మానం



నటరాజ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చీరాల అర్బన్: నాదస్వర విద్వాన్ నటరాజ్‌కు బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. చీరాల మండలం పాతచీరాలలో మద్దిరాలమ్మ అమ్మవారి కొలుపుల మహోత్సవం నాలుగు రోజుల పాటు నిర్వహించారు. అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమాల్లో భాగంగా నాదస్వర విద్వాన్ చావలి వెంకట నటరాజ్‌ను దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి బంగారు పతకాన్ని బహూకరించారు. పుట్టిన గడ్డపై తనకు ఘనంగా సన్మానం జరగడం సంతృప్తిగా ఉందన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న కంటైనర్

- ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన కంటైనర్ డ్రైవర్

మేదరమెట్ల: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ఢీ కొన్న సంఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయరహదారిపై బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. మేదరమెట్ల జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును కంటైనర్ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టాడు. కంటైనర్ డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

మండల స్థాయి కమిటీ సభ్యులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

చీరాల: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2023 కార్యక్రమంలో భాగంగా బుధవారం చీరాల డివిజన్‌లోని మండల స్థాయి పీర్ కమిటీ సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని చీరాలలో నిర్వహించారు. ప్రకాశం పంచాయతీ అధికారి జి.వి నారాయణరెడ్డి, బాపట్ల జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఏ.రమేష్‌లు హాజరై శిక్షణ నిర్వహించారు. అన్ని మండలాల తరపున ఈఓఆర్డీ, ఒక సర్పంచ్, ఒక పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్, డ్వాక్రా యాక్టివ్ మెంబర్ ఒకరు చొప్పున హాజరయ్యారు. చీరాల ఎంపీడీఓ కె.నేతాజీ, ఈవోఆర్డీ బి.మురళి బాపూజీ, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పర్చూరు (చినగంజాం): మండలంలోని కొమర్నేనివారిపాలెంలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 88,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎన్. చెంచు ప్రసాద్ తెలిపారు.

జగనన్న ప్రజల హృదయాల్లో నిలిచారు

- పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



తిమ్మరాజుపాలెం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆమంచి



వలంటీరుకు సేవా వజ్ర పురస్కారాన్ని అందిస్తున్న చైతన్య

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి జగనన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తిమ్మరాజుపాలెం, చెన్నుబొట్ల అగ్రహారంలో ప్రతి ఇంటికీ తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా, ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరింది అనే విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తిమ్మరాజుపాలెం సచివాలయాన్ని సందర్శించి అనంతరం ఆయన చర్చిలో ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ , ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఆసమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు ఎంపీడీఓ జి. లక్ష్మీదేవి, కార్యదర్శి మార్టిన్, ఏపీఎం వంకాయలపాటి లాజర్, మండల కన్వీనర్ కటారి అప్పారావు, తోకల కృష్ణమోహన్, ఉప్పలపాటి అనిల్, అడపా సుధాకరరెడ్డి, పర్చూరు గర్నెపూడి సొసైటీ ప్రెసిడెంట్ కుక్కపల్లి నాగేశ్వరరావు, పర్చూరు ఏఎంసీ చైర్మన్ జువ్వా శివప్రసాద్, గోరంట్ల అరవింద్, సింగి రమేష్, గోరంట్ల శివనాగేశ్వరరావు, ఆదినారాయణ, బాలినేని శ్రీను, రాంబ్రహ్మం, నూర్‌బాషా, అనిల్, మిరియాల ఏడుకొండలు, చింతల శ్రీను, నిడమానూరి ఖాసిం, గోరంట్ల ఆదిశేషయ్య, చిన్నపటి మధు, రామ్మోహన్, దేవరకొండ శ్రీను, ఇంటూరి శ్రీను, గోరంట్ల రాజేష్, మల్లయ్య, వైస్ సర్పంచ్ గాదె సురేష్, భాగ్యరాజ్, తెలగతోటి ఆడియా, విజయరత్నం, యడ్ల రాజు, కీర్తిపాటి సాంబయ్య, గాదె భూషణం, యోహాన్, పోలుదాసు, సుబ్బారావు, సాధు మాణిక్యరావు, హెబ్రియా, గ్యార సుందర్ బాబు యడ్ల ప్రభాకర్, తలమల అబ్రహం, డేవిడ్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలతో మళ్లీ జగనే సీఎం

అద్దంకి: నిష్పక్షపాతంగా వలంటీర్లు అందిస్తున్న సేవలతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎంగా అవుతారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి, వారి ద్వారా ప్రభుత్వ పథకాలను గడప గడపకు అందిస్తున్నాడన్నారు. ఆయన ఎప్పుడూ వారే నా రెండు కళ్లని చెబుతూ ఉంటారని గుర్తు చేశారు. అంత స్థాయి వలంటీర్లదని కొనియాడారు. నిష్పక్షపాతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తే సీఎం మీపై పెట్టుకున్న నమ్మకం వమ్ముకాదన్నారు. ప్రతిపక్షం చేసే విషప్రచారం గురించి ప్రతి ఇంటికీ తెలియజేయాలన్నారు. ఎవరు మంచి చేస్తున్నారో చెప్పాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. చేసిన మంచి గురించి చెప్పుకోవడంలో తప్పు లేదని, మనం మాయలపకీరు (చంద్రబాబు)ను ఎదుర్కోవాల్సి ఉందని సీఎం ఎప్పుడూ చెబుతూ ఉంటారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను రెండో సారి సీఎంగా చేసుకోవాలంటే మీ సేవలే అందుకు కొలబద్దన్నారు. ఒక వేళ మాయల పకీరు గెలిస్తే ముందుగా తీసేసేది వలంటీర్లనే అన్నారు. వలంటీర్ల వ్యవస్థ వంటి గొప్ప వ్యవస్థ ఉన్నందుకు మిగిలిన రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయన్నారు. కొందరు నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని, వారంతా బాగా పనిచేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు. సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రధానంలో భాగంగా వారికి శాలువా కప్పి, ధృవపత్రం అందజేశారు. తరువాత మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ధేనువకొండ సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి ఆదిరెడ్డి, సర్పంచ్ నగేశ్, పలువురు సెక్రటరీలు వలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు. మణికేశ్వరం సొసైటీ ప్రెసిడెంట్ సోమా శ్రీనివాసరెడ్డి, ఆవిశెన ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ గ్రామాల నాయకులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, మండలంలోని వలంటీర్లు పాల్గొన్నారు.



యద్దనపూడిలో వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు

వలంటీర్ వ్యవస్థ ఓ విప్లవం

యద్దనపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో సచివాలయం, వలంటీరు వ్యవస్థ ఒక విప్లవం అని ఎంపీపీ పులగం రజనీ, జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 159 మంది వలంటీర్లు ఉండగా 5గురికి సేవారత్నం, 124 మంది సేవామిత్ర పురష్కారాలు ఎంపికయ్యారు. వీటిని వారికి బహూకరించారు. ఎంపీపీ రజనీ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు తీసుకొచ్చే క్రమంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు రెండు కళ్ళుగా పనిచేస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో పథకాలను అందించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఎంపీడీఓ కృష్ణకుమారి, సర్పంచ్ వల్లేరు రేణుక పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న వలంటీర్ వ్యవస్థ పనితీరును మెచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రతిభ కనపర్చిన వలంటీర్లను ఘనంగా సత్కరించేలా ఏర్పాట్లు చేసింది. మూడో ఏడాది వరుసగా మంచి పనితీరుతో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను గుర్తించి వారికి నగదు బహుమతులతో పాటు, సత్కారాలు అందించాలని చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వలంటీర్లను గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో సత్కరిస్తామని ఎంపీడీఓ డి. విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కారంచేడు-1,2,3, స్వర్ణ-1,2, కుంకలమర్రు-1,2 గ్రామ సచివాలయాలకు చెందిన ఉత్తమ ప్రతిభ కనపర్చిన వలంటీర్లకు సత్కారాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం దగ్గుబాడు, ఆదిపూడి, తిమిడెదపాడు. కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో సత్కారాలు జరుగుతాయన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలితో పాటు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు సేవా పురస్కారాలు

మార్టూరు: మండల పరిధిలో గల గ్రామ పంచాయతీ వలంటీర్లకు నేడు సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఎంపీపీ భూక్యా శాంతి బాయి పాల్గొంటారన్నారు.

అద్దంకిలో...

అద్దంకి రూరల్: అద్దంకి నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న వలంటీర్లకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వలంటీర్లకు సన్మానం నిర్వహించనున్నట్లు బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ రవికుమార్ తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పాల్గొంటారని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో విజ్ఞానం



అద్దంకి వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్నా విద్యార్థులు

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని అద్దంకి శాఖ గ్రంథాలయం గ్రంథపాలకుడు చుండూరు సుగుణరావు అన్నారు. బుధవారం అద్దంకి గ్రంథాలయంలో వేసవి శిబిరానికి 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుడు జ్యోతి చంద్రమౌళి, గాడేపల్లి దివాకరదత్తు పాల్గొన్నారు.

ఆటపాటలతో వేసవి విజ్ఞాన శిబిరం

చీరాల అర్బన్: ఆటపాటలతో కూడిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నారులచే పుస్తక పఠనం చేయించి కథలు చదివించారు. ప్రతిరోజూ వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

జె.పంగులూరు: అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షుతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్ శాఖకు సంబంధించిన అలవలపాడు గ్రామస్తులు కాలం చెల్లు బాటు అయిన టాన్స్‌ఫార్మర్లతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామన్నారు. వాటిని తొలగించి కొత్త కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి కరెంటు కష్టాలు లేకుండా చూడాలని కోరారు. తహసీల్దార్ ఐ. పద్మావతి, జెడ్పీటీసీ రాయిణి ప్రమీల, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిణి వెంకటసుబ్బారావు, కోఆప్షన్ సభ్యులు ఖాశీం ఖాన్

దాడులు, ప్రతిదాడులు హేయం



యద్దనపూడిలో దాడుల గురించి ఆరా తీస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరావు

యద్దనపూడి: దాడులు, ప్రతి దాడులు హేయమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యులు కట్టిపోగు బసవరావు సూచించారు. ఇటీవల యద్దనపూడి మండలంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఆయన గ్రామంలోని ఎస్సీ కాలనీలోని స్థానికులను కలిసి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఫోనులో మాట్లాడి గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసి కాలనీ వాసులకు అండగా నిలవాలని కోరారు. చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కాలనీ వాసులకు సూచించారు. కాలనీలో విద్యుత్ వీధి దీపాలు వెలగకుండా తీవ్ర ఇబ్బందులుకు గురి చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. వివక్షతో కూడిన కరెంట్ కోతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి స్థానిక విద్యుత్ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి వీధి దీపాలు వెంటనే వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఎస్సీ కమిషన్ తరపున ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్డీఓ రవీందర్, తహసీల్దార్ వెంకటరెడ్డి, మార్టూరు సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ శేషసాయి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్‌దిబోరా, ఎమ్మార్పీఎస్ నాయకులు సుబ్బు మాదిగ పాల్గొన్నారు.

నేడు స్వర్ణలో ఉచిత వైద్య శిబిరం

కారంచేడు: మండలంలోని స్వర్ణ మెయిన్ రోడ్డు బ్యాంక్ సెంటర్ వద్ద గురువారం ఉదయం నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హోమియో వైద్యాధికారి డాక్టర్ ఉష ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సాధారణ వ్యాధులతో పాటు, షుగర్, బీపీ, వేసవి ఉష్ణోగ్రతలను కూడా దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల మందులు, ముందస్తు రోగ నిరోధక మాత్రలను ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులు లేకుండా సమావేశాలు ఎందుకు

- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



అధికారులపై అగ్రహంవ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాచర్ల: మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలను అధికారులు లేకుండా ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్.ఖాశింబి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. పాలకవీడు పంచాయతీలో లైన్‌మెన్, జేఎల్ఎమ్ అందుబాటు ఉండటం లేదని, లైన్‌మెన్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నామని, దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి గణేష్ సచివాలయంలో అందుబాటులో ఉండటం లేదని సర్పంచ్ వివరించారు. ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన విద్యుత్‌శాఖ ఏఈ రామచంద్రుడు సమావేశం ప్రారంభం కాగానే వెళ్లిపోవడంపై అనుములపల్లె, పాలకవీడు, చినగానిపల్లె సర్పంచులు రమేష్, పల్నాటి లతీఫ్, పగడాల రమేష్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమావేశానికి రాకుంటే మా సమస్యలు కార్యాలయంలోని గోడలకు చెప్పుకోవాలా అని ప్రశ్నించారు. వారంలో రెండు రోజుల మాత్రమే ఎంఈవో కోటేశ్వరరావు కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నారని, మిగతా రోజుల్లో ఒంగోలు చేరుకుంటున్నారని అనుములపల్లె సర్పంచ్ రమేష్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవం నిర్వహించే సమయంలో ప్రొటోకాల్ ప్రకారం సర్పంచులకు, ఎంపీటీసీలకు చెప్పడం లేదన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కేవలం మండల సర్వసభ్య సమావేశంలో మాత్రమే కనిపిస్తున్నారని, మిగతా రోజుల్లో మండలంలో ఎక్కడా దర్శనం ఇవ్వడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకవీడు గ్రామంలో ఫీల్డ్‌అసిస్టెంట్ ఉపాధి కూలీలకు ప్రతి రోజు మస్టర్ వేయకుండా వారానికి ఒక్కసారి మాత్రమే హాజరు వేస్తున్నారని, ఉపాధి పనులు జరిగే ప్రాంతానికి ఫీల్డ్‌అసిస్టెంట్ వెళ్లకుండానే తన ఇంట్లో కూర్చుని వారం రోజుల మస్టర్ ఒక్కసారి వేస్తున్నాడని ఆకవీడు సర్పంచ్ తలపాటి దేవదానం సమావేశం దృష్టికి తీసుకుని వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.కవితా చౌదరి, వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, హార్టికల్చర్ హెచ్‌వో శ్వేత, గృహనిర్మాణశాఖ ఏఈ విజయలక్ష్మి, ఇర్‌ఐ పిడతల గంగిరెడ్డి, ఆకవీడు పీహెచ్‌సీ డాక్టర్ డి.ఖాదర్‌బాష, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవండి



లబ్ధిదారులకు బ్రోచర్ ఇస్తున్న కృష్ణ చైతన్య

జె. పంగులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడేళ్ళ పాలనలో అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని ఏపీ శాప్ నెట్ చైర్మన్, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన క్రిష్ణచైతన్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముప్పవరంలో 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశామని తెలిపారు. డ్రైనేజ్ సమస్యలను పై ప్రజలు క్రిష్ణచైతన్య దృష్టికి తీసుకెళ్లగా.. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. జిల్లా సేవా దళ్ అధ్యక్షులు పులికం కోటిరెడ్డి, ఎంపీపీ తేళ్ళ నాగమ్మ, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిణి వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, సర్పంచ్ రౌతు సాంబశివరావు, శంకర్‌రెడ్డి, రామాంజినేయులు, కామేపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వేటపాలెం: రామన్నపేట శివారులోని లెప్రసీ కాలనీలో వింగ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను సంస్థ అధ్యక్షుడు చింతపల్లి రామకృష్ణ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు పది కిలోల బియ్యం, చింతపడం, కందిపప్పు, నూనె సంస్థ తరపున ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రతి ఏడాది వివిధ వ్యాధులతో బాధపడు తున్న 275 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నమని సంస్థ మేనేజర్ బాబ్జి తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షుడు మల్లికార్జున రావు, కళ్యాణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కార్యక్రమం



ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

జె. పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. చీరాల అటవీ క్షేత్రం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. రమేష్ గ్రామంలోని గ్రామ ప్రజలకు, ఉపాధి కూలీలకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారి రమేష్ మాట్లాడుతూ ఇంధన రక్షణ, జల రక్షణ, ప్లాస్టిక్ నియంత్ర, ఈ వ్యర్థాలు తగ్గించుట, ఆరోగ్య కరమైన జీవన విధానం అలవరుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి జానీ బేగం, పి. శ్రీనివాసరావు హాజరయ్యారు.

కోలాహలంగా కొలుపులు



గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం



పూజలందుకుంటున్న అంకమ్మతల్లి ఉత్సవ విగ్రహం, బొల్లావు

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెంలో ఒట్టిగొర్లవారి అంకమ్మ తల్లి కొలుపులు నాలుగు రోజులుగా కోలాహలంగా జరుగుతున్నాయి. బుధవారం దీపం అవసరం, తేనే ఆట, గ్రామోత్సవం, పాపావేశం చేపట్టారు. గురువారం గుడారసేవ, కొలుపుల ముగించు అన్నదానం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ వారు వివరించారు. వివిధ గ్రామాల్లో ఉన్న ఒట్టిగొర్ల కుటుంబీకులంతా గ్రామానికి చేరారు.